స్కెచ్

# నాగేశ్వరికి విముక్తి

కె. సీతాదేవి

రావు అడిగాడు గుమ్మంలో అడుగు పెడుతూనే "సుజా! మా ఆఫీసులోకి కొత్త క్లర్కు వచ్చింది తెలుసా?"

సుజాత వింతగా చూస్తూ "అంత విశేషమా అది! నాకేం తెలుస్తుంది మీ ఆఫీసు సంగతి? ఏమిటి సంగతి?"

"అబ్బే అంత విశేషమేం కాదులే. ఆవిడకి మీ గురించి అంతా తెలుసుట. మీరిక్కడే ఉన్నారు కనుక తెలిసినవారు కాబట్టి నేను కాస్త ధైర్యంగా ఉండచ్చు బాబూ! అంది. అంతా కొత్తగా వచ్చినట్లుంది పనిలోకి"

"అయితే అవిడ పేరేమిటి?"

"నాగేశ్వరిట. మీవూరే. చిన్నప్పుడు మీరంతా కలిసి ఉండేవారుట ఒకే కుటుంబంలో లాగ. నువ్విక్కడే ఉన్నావంటే తప్పక చూడ్డానికి వస్తానంది"

"అహా! నాగేశ్వరా" అంటూ ఆశ్చర్యపోయింది సుజాత. "దానికేమంత పనిచేయడానికి అవసరంలేదే!"

♦ ♦ ♦

ఆమర్నాడు సాయంత్రమే నాగేశ్వరి వచ్చింది. అబ్బా! ఎంత మారిందని? "సుజా! ఎన్నాళ్లయిందే నిన్నుచూసి మనంవిడి పోయాక మళ్లీ కలుసుకోనేలేదు" అంటూ విప్పారిన ముఖంతో వచ్చింది లోపలికి. చెరసాల్లో కఠిన నరకంలోంచి విడుదలై తన ఆప్యాయమైన మనుషుల దగ్గిరగా ఉన్నంత ఆనందం, విచారం కనుపించాయా ముఖంలో.

సుజాత వెంటనే ఏం మాట్లాడలేక పోయింది. "రా నాగేశ్రీ అదేమిటే అల్లా ఆయిపోయావు!" అంటూ పలకరించింది. "మీ చిన్ననాటి ముచ్చట్లు చాలావుంటాయి నేనుకూడా ఎందుకు మధ్యన" అంటూ రావు స్నేహితుడింటికి పేకాడ్డానికి వెళ్లిపోయాడు.

"కాలప్రవాహంలో పదిహేను పదహారు ఏళ్ళనా దొర్లిపోయియుంటాయి. రావుగారూ నువ్వూ సంతోషంగానే ఉంటున్నట్లేకదూ? ఇంకా అతను నవ్వుతు తుళ్ళుతూ మాట్లాడుతాడంటే చెప్పుకో దగ్గవిషయమే!" అంది కొంత సేపయాక నాగేశ్వరి.

"ఓ ఫరవాలేదు. సంతోషంతో చంపేస్తున్నారనుకో! ఈ మధ్యమరీని. రెండేసి వారాలకేనా ఓసారి స్నేహితులతోనూ వాళ్ళతోనూ సరదాగా వనభోజనాలు లేకపోతే ఇంటి దగ్గర హడావిడులు, కష్టసుఖాల్ని మరచి పోయేలాగ ఏ పల్లెతోటలలోకో తిరగడం. ఇదంతా లోకానికూడా కాలక్షేపంగా ఉంది"

"దానికేంలే, ఎప్పుడూ లోకానికి విమర్శనాజ్ఞానం జాస్తీకదా!" అంది నాగేశ్వరి.

"నువ్వు ఉద్యోగంచేయడం ఏమిటి? సుధీర్ గారు ఏం చేస్తున్నారు?"

"ఆయనకేం మహారాజులా, నిక్షేపరాయుడు లాగున్నారు."

"ఏరి కోరి— ఆ గోపాలంబావని కాదని! ఆ సుధీర్ గారిని పెళ్ళాడేదాకా నాన్నగారిని ఆత్మాభిమానం చంపుకుని కాళ్ళు బలపాలు కట్టేదాకా తిప్పించావుకదా! నాకింకా జ్ఞాపకం" అంది సుజాత.

"ఆ గోపాలంబావే మళ్ళీ కటికచీకటిలో కప్పువిప్పు కలిగించాడు"

"అతను అక్కడే వ్యవసాయంచేస్తున్నాడా?"

"ఆఁ ఇప్పుడక్కడేఉన్నాడులే. ఉండు. అసలు కథంతా చెప్పనీ. ఆమధ్యని మా యింటికి వచ్చాడు. భార్యనీ పిల్లలనీ తీసుకుని పట్నం చూపిద్దామని. మాయిల్లు వెతుకుంటూ వచ్చారు. నన్ను చూసిపోదామని. భార్య జానకి చక్కగా పొందికగాఉంది. మంచి ఖరీదైన నగలు. నాజూకైన చీరలూనూ. పిల్లలు ఎంతో నమ్రతగా మంచి శిక్షణలో పెంచినట్లున్నారు. పిల్లలు పిన్ని పిన్ని అంటూ అతిచేరికగావచ్చారు. మా యింట్లో వాళ్లుకూడా ఒకటే మెచ్చుకోడం. ఇది మనరాతకొద్దీ దొరికింది అంటూ పనిలో పని నన్నుమాటలనడం. సామ్యం చెప్పినట్లుగా అయింది నాఘని. తనిప్పుడు ఒక స్కూలు నడిపిస్తున్నాడట చిన్నపిల్లలకి. తర్వాత జానకి అన్నీ వివరంగాచెప్పింది. తనూ అతనూ కూడ బలుక్కుని పల్లెటూరయినా శ్రద్ధచేసి చదువుకున్నారు. అతను ఇంటరు ప్యాసుఅయాడు. ఆమె స్కూలుఫైనల్ చదివింది. ఒకపూట పనివ్యవసాయం అజమాయిషీ! ఒకపూట స్కూలుపని చూస్తున్నారుట. తనేమో అక్కడి చిన్ని చిన్ని పిల్లలకి మధ్యాహ్నం భోజనాలు పనులు. ఆటలు ఆడించడం. చేస్తుందట. వింటూంటే చాలా ఆశ్చర్యంవేసింది. అక్కా! నువ్వు చేసినబొమ్మలు, గీసిన చిత్రాలూ, అల్లికపనులూ మా స్కూలుకి తెచ్చిపెట్టుకున్నాం నాన్న నడిగి- అందరిచేతా చేయించడానికి. మీ బావకెంతో మక్కువ అవంటే."

"అవును జానకీ మీ వాళ్ళకు నేనంటే ఎంతో అభిమానంమరి. అని మాత్రం అనకలిగా. ఇంతట్లో నే మా అబ్బాయి కొట్టాడని చిన్న తోడికోడలి కొడుకు వచ్చి కంప్లయింటులు! సగం చచ్చి పోయానంటేనమ్ము. ఆవేళనించీ నాలో నిద్ర పోతున్నశక్తి అమాంతంగా మేల్కొని నన్ను సతాయించడం మొదలు పెట్టింది. ఆ యింట్లో పడిన నాటినించీ నశించిన జీవకణాలకి తిరిగి ప్రాణంవచ్చిందేమోమరి!"

"అయితే అంత అన్యాయంగా ఉండేదా నీ పని? వాళ్లది చాలా ఫార్వర్డు స్సొసైటీ అని కదూ," అంటూ నవ్వింది సుజాత.

"నిజం నీకల్లాగే ఉంటుందిలే! ఆ వాతావరణంలో అదేమి శక్తి ఉందోకాని. ఒక పని మంచిదే అయినా చేయ్యలేవు. మంచిమాటే అయినా చెప్పలేవు. నిజంకూడా ధైర్యంగా మాట్లాడలేవు."

"అయితే చెడ్డపని చెయ్యొచ్చు. చెడ్డగా మాట్లాడొచ్చు. అబద్ధం చెప్పవచ్చు. అంటావు. అంతేనా?"

"అదికాదే మరి. ఆశక్తి ఆస్తులానికి ఉంది. అయితే సుజా మనిషికి తిండి బట్టాయిచ్చి పచ్చని వెలుగులు కన్పించేచోట బంధించేస్తే ఆ వెలుగు చూస్తూ మనిషి కాలం గడపకలదంటావా? స్వేచ్ఛ కొంచంకూడా స్వేచ్ఛ అవసరంలేదా ప్రాణానికి?" నిలువునా, ప్రశ్నించింది నాగేశ్వరి.

"అయితే అదీలేని వాళ్లమాట ఏమంటావు?" అడిగింది సుజాత.

ఆ ఉద్దేశ్యంతోటేనే నిన్నాళ్లూ ఉన్నాను. ఆశూన్యవాదానికి అంతఃకరణ ఒప్పుకోలేదు. నేను మహాకాంక్షతో కదా ఆయన్ని చేసుకొన్నది?"

"అందరూ అనడం మీరు బాగానే ఉన్నరని"

"అదేనే విశేషం. ఆఖరికి అతనికి చిన్న సర్వెంటు మాదిరి సహాయానికి కూడా కాలేక పోయాను. ఎంతో ఆదర్శంగా ఉండాలని కలలు కన్నాను. అందుకేనావన్నీ తీరని కోరికలు," నిట్టూర్చింది నాగేశ్వరి,

"ఆఖరికి పిల్లలకి కూడా అమ్మంటే కొంచెం ఆశకూడాలేదు సరికదా అతి చులకన భావం ఏర్పడింది. పెద్ద నాన్నగారు నా రూపం నాతీరు, చూసి రెండునెలలు పంపించండి అని బ్రతిమాలి తీసుకొచ్చారిక్కడికి. ఆయన్ని ఎల్లాగో ఒప్పించి కొన్నాళ్లు నన్ను నేను మరిచిపోవాలి అనుకుని ఈ ఉద్యోగంలో చేరాను. పక్షం రోజులయింది. రావుగారు శలవులో వుండడంచేత ఇన్నాళ్ళు నీసంగతి తెలియలేదు. కుంచిత మనసులకి దూరంగాఉండి ఆరోగ్యం బాగు పరచుకుంటే తరువాత ఏమవుతోందో మరి!"

"అయితే అంత అన్యాయంగా ఉంటుందా నాగేశ్వరీ?"

"ఆ! ఇల్లాలు అద్దెపైకి చెప్పకూడదు. క్షీణించి పుల్లలాగయి పోయానిందుకే. మళ్ళీ తేరుకోగల నేనూ ఒక నెలలో"

"అంత హాయిగాఉందా నాగేశ్వరీ!-అయ్యో నాదగ్గర నాలురోజు లుండిపో."

"అవును సుజా! రిలీఫ్. దానికే ముఖంవాచి పోయాను." అంటూనేఉంది నాగేశ్వరి... వీధి తలుపులు తెరుచుకున్నాయి. రావుతో సుధీర్ ప్రత్యక్షం!

తన చివరిమాటలు వారి చెవిని పడ్డయేమోనని గాలి వానకి అరిటాకులా, కపించిపోయింది. నాగేశ్వరి.

"రావుగారూ తరువాత మాట్లాడుకుందాం. నాగేశ్వరీ, లేపోదాం. బస్సుకూడా రెడీగాఉంది. పెద్ద మామయ్యగారితో చెప్పేవచ్చా. బెడ్డింగు బస్సుకి వారు తెస్తామన్నారు."

"అదేమిటి సుధీర్ గారూ, అప్పుడేనా ప్రయాణం ఇంతట్లోనే ఏంవచ్చింది! ఇక్కడ నాలుగు రోజులు ఉండనీయండి. "అంటూనే ఉంది సుజాత.

అంతే! అల్లాగే జారపడి మ్రాన్పడిపోయింది నాగేశ్వరి. ఆ మనసుకీ శరీరానికీ కూడా శాశ్వత శాంతి లభించింది.

ఆమె అమాయికత్వం, కళాతృష్ణ, సేవాభిలాష, చిన్నతనంనించీ తెలిసిన సుజాతకి కన్నీరు కట్టలు తెంచుకు ప్రవహించింది. ఆమె కష్టమయ జీవితం మళ్లీ తనకి జ్ఞాపకం చేయడానికీ మరవకుండా ఉండడానికీనా ఇప్పుడు నాదగ్గరకి వచ్చింది? అనుకుంటూ సుజాత నిట్టూర్చింది.